
ప్రజాశక్తి

శుక్రవారం 31 అక్టోబర్ 2025

5

విజయనగరం





మడ్డువలస ప్రాజెక్టు నుంచి విడుదల చేస్తున్న నీరు

25వేల క్యూసెక్కుల నీరు విడుదల

మడ్డువలసకు తగ్గని వరద ఉధృతి

వంగర: మడ్డువలస ప్రాజెక్టుకు వరద ఉధృతి తగ్గలేదు. సువర్ణముఖి, వేగావతి నదుల నుండి గురువారం భారీగా వరద నీరు రావడంతో ప్రాజెక్టు ఎనిమిది గేట్లు ఎత్తి 25 వేల క్యూ సెక్కుల నీటిని నాగావళి నదిలోకి విడిచిపెడుతున్నట్లు ఎఇ కె. నీతీన్ కుమార్ తెలిపారు. ఇన్ ఫ్లో తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని అన్నారు.

మొంథా నష్టం రూ.110.78 కోట్లు

- కొనసాగుతున్న నష్టగణన
- అత్యధికంగా రహదారులకు రూ.79.66కోట్లు
- చిన్ననీటి వనరులకు రూ.23.43 కోట్లు గండి
- పంట పొలాల్లో తగ్గని వర్షపునీరు
- ఇప్పటికీ అంచనాలకు అందని వ్యవసాయ పంటల నష్టాలు
- వరి, పత్తి, మొక్కజొన్నపై తీవ్ర ప్రభావం



వేపాడ.. పొలంలో నీటమునిగి కుళ్లిపోయిన వరి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మొంథా తుపానుతో మూడు రోజులపాటు కురిసిన భారీ వర్షాలు,వీచిన గాలులకు జిల్లా వ్యాప్తంగా 110.78కోట్లు నష్టం వాటిల్లింది. ఇందులో అత్యధికంగా ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్ శాఖ రహదారులకు సుమారు రూ.79.66 కోట్ల మేర నష్టం జరిగింది. వ్యవసాయ, ఉద్యాన పంటలు, తదితరాల నష్టగణన ఇంకా కొనసాగుతోంది. తుపాను ప్రభావం మొత్తం 21 మండలాల్లో 68 గ్రామాలు, మూడు పట్టణాలపై చూపింది. 6904 ఎకరాల మేరకు పంట నష్టం వాటిల్లగా ఇందులో 10 ఎకరాలు ఉద్యాన పంటలు, మిగిలిన విస్తీర్ణం వ్యవసాయ పంటలు ఉన్నాయి. ఇందులోనూ అత్యధికంగా వరి ఉంది. పలుచోట్ల కోతదశ, మరికొన్నిచోట్ల పొట్టదశలో ఉన్న వరిచేలు నీటముని గాయి. మొక్కజొన్న, పత్తి, తదితర పంటలు కూడా దెబ్బ తిన్నాయి. సుమారు వంద కిలోమీటర్ల మేర ఆర్అండ్‌బి రహదారులు దెబ్బతిన్నాయి. 652చెట్లు నేలకూలిపోయాయి. నాలుగు రోడ్లపై నుంచి వర్షం నీరు ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. రహదారులు దెబ్బతినడం వల్ల 41.35కోట్లు నష్టం జరిగి ఉంటుందని ఆ శాఖ అధికారులు అంచనా వేశారు. పంచాయతీరాజ్‌శాఖ పరిధిలో మరో 78.28కిలోమీటర్ల మేర 36 రోడ్లు దెబ్బతిన్నాయి. వీటి విలువ 38.31కోట్లు ఉంటుంది. పట్టణ ప్రాంతాల్లో రూ.8.5లక్షలు నష్టం వాటిల్లింది. మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించి 184 చిన్ననీటి వనరులు దెబ్బతినగా రూ.23.43కోట్లు నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం పరిధిలో 9 పంపింగ్ మిషనరీ పనులు, 10 నిర్మాణాలు, ఐదు పైపులైన్లు దెబ్బతిన్నాయి. వీటి విలువ రూ.38.01లక్షలు ఉంటుందని అంచనా. ఎపిఇపిడిసిఎల్ పరిధిలో రూ.4.50లక్షలు నష్టం వాటిల్లింది. జిల్లా వ్యాప్తంగా 90 ఇళ్లు దెబ్బతినగా ఇందులో 5 పక్కా ఇళ్లు, 6 మిద్దిళ్లు, 23 పూరిళ్లు ఉన్నాయి. 56 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. వీటి నష్టం 21.36లక్షలు ఉంటుందని గృహ నిర్మాణ శాఖ అధికారులు అంచనా వేశారు. ఆరు పశువులు మృత్యువాత పడ్డాయి. మూడు పశువుల శాలలు దెబ్బతిన్నాయి. వీటి విలువ రూ.3.18లక్షలు ఉంటుందని సంబంధిత శాఖ అధికారులు అంచనా వేశారు. జిల్లాలో తుపాను బాధితుల కోసం 905 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలకు తరలించిన వందలాది మందికి ఆహారపొట్లాలు పంపిణీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూం కొనసాగుతోంది. అదే కేంద్రం నుంచి వివిధ శాఖల్లో జరిగిన నష్టాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ నివేదికలను అప్‌డేట్ చేస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. పంట పొలాల్లో నీరు తగ్గితే తప్ప, వాటి నష్టం ఎంత ఉంటుందో తేలే అవకాశం లేదు. ఈనేపథ్యంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో నష్టాన్ని గుర్తించే పనిలో ఉన్నారు.

మండలాల్లో పంటనష్టం వివరాలు

తెర్లాం : తుపాను ప్రభావంతో మండలంలో 15 గ్రామాల్లో 456 మంది రైతులకు చెందిన 361 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు ఎఒ శ్రీనివాసరావు తెలిపారు. ప్రాథమిక నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించామని చెప్పారు. విఎఎలు, విఆర్ఒలు క్షేత్రస్థాయిలో నష్టాన్ని పరిశీలిస్తున్నారని తెలిపారు.

రేగిడి: మండలంలోని 66 గ్రామాల్లో 184 హెక్టార్లు వరి పంట ముంపునకు గురి కాగా, వీటిలో 120 హెక్టార్లు నేలకు ఒరిగాయని ఎఒ శ్రీనివాసరావు తెలిపారు. 22 హెక్టార్లలో చెరకు పంట నష్టం వాటిల్లినట్లు తెలిపారు.

గుర్ల : మండలంలోని 30 హెక్టార్లలో వరి పంట నీట మునిగినట్లు వ్యవసాయ అధికారి తిరుపతి రావు తెలిపారు. అధికారులు పంట నష్టాన్ని పరిశీలించి నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

దత్తిరాజేరు : మండలంలోని మొంథా తుపాను వల్ల 12 ఎకరాల్లో వరిపంట నేలకొరిగిందని ఎఒ అనురాధ తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకులు అన్ని గ్రామాల్లో పంటలను పరిశీలించి, పూర్తిస్థాయి నివేదికను సిద్ధం చేస్తారని చెప్పారు.

వేపాడ : మండలంలో ఎంకెఆర్‌పురం సచివాలయ పరిధిలో పెదగుడిపాల, భరతవాణిపాలెం రెవెన్యూ పరిధిలో వరిపంట వర్షాలతో తడిసి ముద్దయింది.

బొబ్బిలి : బొబ్బిలి మండలంలో పెంట, ఎం.బూర్జవలస, జగన్నాథపురం, పారాది, తదితర గ్రామాలలో వర్షాలకు వరిపంట నేలమట్టమైంది. మండలంలో 40.7 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లినట్లు ఎఒ మజ్జి శ్యామసుందర్ తెలిపారు. వరి 32, పత్తి 5.7, మొక్కజొన్న 2.97 ఎకరాలలో నష్టం జరిగినట్లు చెప్పారు.



జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో సమీక్షిస్తున్న మంత్రి శ్రీనివాస్

తుపాను నష్టాలపై మంత్రి సమీక్ష

ప్రజాశక్తి-విజయనగరం కోట

మొంథా తుపాను నేపథ్యంలో జిల్లాలో జరిగిన నష్టాలపై ఎంపి,ఎమ్మెల్యేలతో కలసి రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం తన క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. తుపాను ప్రభావం, పునరుద్ధరణ చర్యలు, పంట నష్టాలుతో పాటు జిల్లాలో అభివృద్ధి,సంక్షేమంపై చర్చించారు. సమావేశంలో ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు ఎమ్మెల్యేలు కిమిడి కళా వెంకటరావు, బేబినాయన, కోళ్ల లలితకుమారి, లోకం మాధవి, టిడిపి జిల్లా అధ్యక్షులు, డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున, బిజెపి జిల్లా అధ్యక్షులు రాజేష్ వర్మ, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్విని పాల్గొన్నారు.



నాగావళి నది ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

వరద ప్రభావాన్ని పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-రేగిడి, రాజాం

మొంథా తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాల ప్రభావాన్ని జిల్లా కలెక్టర్ ఎస్. రామసుమదర్ రెడ్డి గురువారం పరిశీలించారు. గురువారం రాజాం నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన జరిపారు. రహదారులను, పంట పొలాలను, నీటి ప్రవాహాలను పరిశీలించారు. రేగిడి ఆమదాలవలస మండలం సంకిలి బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నాగావళి నదిని పరిశీలించారు. నది ప్రవాహం, దిగువనున్న ప్రాంతాలు, పంట పొలాల పరిస్థితిని తెలుసుకున్నారు. నష్ట నివారణా చర్యలు తీసుకోవాలని, పరివాహక ప్రాంతాల ప్రజలను హెచ్చరించాలని కలెక్టర్ ఆదేశించారు. రాజాం తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. పర్యటనలో ఆర్డీవో జివి సత్యవాణి, తహశీల్దార్ కృష్ణలత , ఇతర రెవెన్యూ అధికారులు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.



కోతకు గురైన మారిక రోడ్డు

కొట్టుకుపోతున్న మారిక రోడ్డు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కరకవలస పంచాయతీ పరిధిలో మారిక గ్రామానికి నిర్మించిన రోడ్డు కొట్టుకుపోతోంది. వర్షాలు కురిసిన ప్రతిసారీ రోడ్డు కోతకు గురవుతోంది. రోడ్డు నిర్మాణంలో నాణ్యతా లోపం వల్లే ఈ దుస్థితి నెలకొందని సిపిఎం నాయకుడు చల్లా జగన్ తెలిపారు. అధికారుల పర్యవేక్షణా లోపమే దీనికి కారణమని చెప్పారు. కాంట్రాక్టర్, ఇంజినీరింగ్ అధికారులు చేతులు కలిపి నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా రోడ్డు నిర్మాణం చేపట్టారని, దీనిపై ప్రభుత్వం విచారణ చేపట్టాలని కోరారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు.

కాలువ గట్టుకు గండి



నీటిని మళ్లించేందుకు జెసిబితో కాలువ తవ్విస్తున్న రైతులు

ప్రజాశక్తి - గజపతినగరం

మొంథా తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వరద పోటెత్తడంతో డోలపాలెం సమీపంలో 13 వంతుల కాలువ గట్టుకు గండి పడింది. దీంతో సుమారు 15 ఎకరాలకు పైగా వరి పంట నీట మునిగింది. పంట మరో పది రోజుల్లో చేతికి వచ్చే సమయంలో అధిక వర్షాల వల్ల నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించేలోగా పంట నష్టపోయే అవకాశం ఉందని స్థానిక రైతులు భావించి, సొంత నిధులతో జెసిబి సహాయంతో ముంపునకు గురైన పొలాల్లో వరద నీటిని సమీపంలోని ఎంఎన్ ఛానల్‌కు మళ్లించారు. సకాలంలో నీటిని మళ్లించడం వల్ల నష్ట తీవ్రతను తగ్గించే ప్రయత్నం చేశారు. ఈ సహాయక చర్యలను గ్రామ సర్పంచ్ గేదల ఈశ్వరరావు, దేవుడు, బెల్లాన సత్యనారాయణ, రైతులు పర్యవేక్షించారు.



రోగులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

డయేరియా అదుపునకు చర్యలు

బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే బేబినాయన

ప్రజాశక్తి-రామభద్రపురం

డయేరియాను అదుపు చేసేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని ఎమ్మెల్యే బేబినాయన ఆదేశించారు. మండలంలోని ముచ్చర్లవలసలో డయేరియా బారిన పడి, మండల కేంద్రంలోని ఎన్ఆర్ఐ ఆసుపత్రి, బాడంగి సిహెచ్‌సిలో బాధితులు చికిత్స పొందుతున్నారు. గురువారం డయేరియా బాధితులను ఎమ్మెల్యే పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 16 మంది డయేరియా బారిన పడ్డారని తెలిపారు. వారిలో కొందరి ఆరోగ్య పరిస్థితి కుదుటపడటంతో బుధ, గురువారాల్లో డిశ్చార్జి అయినట్లు తెలిపారు. తుపాను కారణంగా ఏడొంపుల గెడ్డ పొంగడంతో, కొంతమేర నీరు కలుషితమైనందున డయేరియా బారిన పడ్డారని చెప్పారు. ప్రజలంతా కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మడక తిరుపతిరావు, చింతల రామకృష్ణ, కరణం విజయ భాస్కరరావు, కనిమెరక శంకరరావు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

విజయనగరం టౌన్ : అవినీతి జాడ్యాన్ని తరిమికొట్టి సమాజాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య పల్లి నల్లనయ్య, ఎసిబి డిఎస్‌పి ఎన్. రమ్య పిలుపునిచ్చారు. అవినీతి నిరోధక అవగాహన వారోత్సవాలలో భాగంగా గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సమాజంలో అవినీతి లేకుండా నిజాయితీగా సేవలు అందించిన నాడే ఏ అధికారికైనా, ఉద్యోగి కైనా పేరు ప్రఖ్యాతులు వస్తాయన్నారు. లంచం అనేది పాపంగా, దుర్మార్గంగా పరిగణించాలన్నారు. అవినీతి మహమ్మారిని సమాజం నుండి తరిమికొట్టడానికి ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని అన్నారు. ఎసిబి డిఎస్‌పి రమ్య మాట్లాడుతూ లంచం, అవినీతికి పాల్పడిన వారు ఏసీబీ నుండి తప్పించుకోలేరన్న విషయాన్ని గమనించాలన్నారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టడం అంటే మన పాపాన్ని మనమే పెంచుకుపోతున్నట్లు అర్థమని అన్నారు.

ప్రతి నష్టాన్నీ నమోదు చేయాలి

టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రామసుందర్ రెడ్డి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

తుపాను వల్ల కలిగిన ప్రతి నష్టాన్నీ నమోదు చేయాలని కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జలాశయాలన్నిటినీ ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నష్టాలు జరగకుండా చూడాలన్నారు. గురువారం తుపాను, వరద పరిస్థితి పై జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భారీ వర్షాలకు, వరదలకు జరిగిన ప్రతి చిన్న నష్టాన్ని కూడా నమోదు చేసి అంచనా వేయాలని తెలిపారు. రహదారులు, విద్యుత్, పంట, పశు నష్టాలతోపాటు వసతి గృహాలను , పాఠశాలలను , వైద్య, పశు శాఖల భవనాలను నమోదు చేయాలన్నారు. సంయుక్త కలెక్టర్ సేదు మాధవన్ మాట్లాడుతూ జిల్లాలో తుపాను బాధితులైన వారు చేనేత, మత్స్యకార కుటుంబాలు, పునరావాస కేంద్రాల్లో ఉన్నవారు 4949 మంది కార్డు దారులు ఉన్నారని, వారిలో చేనేత, మత్స్యకార వారికీ 50 కేజీ ల చొప్పున బియ్యం , పామ్ ఆయిల్ 1 లీటర్ , చెక్కెర 1 కేజీ , ఉల్లిపాయలు 1 కేజీ బంగాళా దుంపలు 1 కేజీ చొప్పున పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పునరావాస శిబిరాల్లో ఉన్న వారికీ 25 కేజీల చొప్పున బియ్యం, ఇతర నిత్యావసరాల వస్తువులు అందించనున్నట్లు తెలిపారు.

కార్యాలయ వ్యర్థాలు వేస్తే చర్యలు

కలెక్టరేట్ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలలో వ్యర్థాలు కలెక్టరేట్ ప్రాంగణంలో వేస్తే సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. ప్రభుత్వ కార్యాలయాలలో శుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. కొన్ని కార్యాలయాలు కలెక్టరేట్ ప్రాంగణంలోనే వ్యర్థాలను పారబోసి పరిశుభ్రతను నిర్లక్ష్యం చేస్తున్నారని, వారి నిర్లక్ష్యాన్ని సీరియస్‌గా పరిగణిస్తామని హెచ్చరించారు.

జాబ్‌మేళాలో 30 మంది ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో స్థానిక గవర్నమెంట్ ఐటిఐ కాలేజీలో గురువారం జాబ్‌మేళా నిర్వహించారు. 80మంది అభ్యర్థులు హాజరు కాగా 30 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ టివి గిరి మాట్లాడుతూ చదువుకున్న నిరుద్యోగ యువతకు జర్మన్ భాష నేర్పించి జర్మన్ లో ఉద్యోగం కల్పించేందుకు ఈ జాబ్ డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాలను అభివృద్ధి పరచుకోవాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు 4 నెలలు జర్మన్ భాషపై శిక్షణ ఇచ్చి అనంతరం జర్మనీ కి పంపుతామని తెలిపారు. జీతం నెలకు రూ.2,52,658 నుండి 3,24,846 వరకు ఇస్తారని తెలిపారు. జాబ్ మేళాలో ముఖ్య అతిథులుగా జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డిఇఒ మాణిక్యంనాయుడు

ఆదర్శ పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-గంట్యాడ

మండలంలోని మదనాపురం ఆదర్శ పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్యం నాయుడు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సమీపంలో ఉన్న బాలికల వసతిగృహాన్ని పరిశీలించారు. అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పదో తరగతి విద్యార్థులకు గణితం బోధించి ప్రశ్నలను వేసి సంతృప్తి వ్యక్తంచేశారు. ఉపాధ్యాయులకు కొన్ని సూచనలను అందించారు. మధ్యాహ్న భోజన ఏర్పాట్లు పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఎపిసి రామారావు, ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.రామకృష్ణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సులో పొగలు

కిటికీ అద్దాలు పగలగొట్టి దూకేసిన ప్రయాణికులు

ప్రజాశక్తి-భోగాపురం



పగలకొట్టిన బస్సు అద్దాలు

విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న ఆర్‌టిసి పల్లెవెలుగు బస్సులో గురువారం సాయంత్రం పొగలు వచ్చాయి. భోగాపురంలో యూనియన్ బ్యాంకు సమీపంలో సర్వీస్ రోడ్డులో వెళ్తుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. ఆ సమయంలో బస్సులో 50 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారు. అకస్మాత్తుగా బస్సు ముందు భాగం నుంచి నిప్పురవ్వలు చిమ్మడంతో, డ్రైవర్ ఉన్నచోట దట్టంగా పొగలు వ్యాపించడంతో ప్రయాణికులు భయంతో బస్సు అద్దాలను పగలగొట్టి కిందికి దూకేశారు. డ్రైవర్ వెంటనే బస్సు నిలిపేయడంతో మిగతా వారంతా సురక్షితంగా కిందకు దిగారు. అనంతరం వెనుక వస్తున్న మరో బస్సులో ప్రయాణికులను ఎస్ఐ సూర్యకుమారి పంపించారు. విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ వల్ల పొగలు వచ్చినట్లు తెలుస్తోంది.

విద్యుత్ శాఖకు తుపాను నష్టం రూ.4.50 లక్షలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మొంథా తుపాను కారణంగా గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు జిల్లా వ్యాప్తంగా విద్యుత్తుశాఖకు రూ.4.50 లక్షలు నష్టం జరిగినట్లు ఆ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ మువ్వల లక్ష్మణరావు తెలిపారు. జిల్లాలో 33 కెవి ఫీడర్లు 11, 11 కెవి ఫీడర్లు 12, 33/11 కెవి సబ్‌స్టేషన్లు 4 పాక్షిక మరమ్మత్తులకు గురయ్యాయని తెలిపారు. 33 కెవి విద్యుత్ స్తంభాలు 7, 11 కెవి ఫీడర్లు విద్యుత్ స్తంభాలు 12 నెలకొరిగినట్లు తెలిపారు. మొత్తంగా 39 విద్యుత్ స్తంభాలు మార్చామని, నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మత్తులకు గురికాగా, కిలోమీటరు పొడవు విద్యుత్ వైర్లను ఏర్పాటు చేయాల్సి ఉందని తెలిపారు. ఈ నష్టం సుమారుగా రూ.4.50 లక్షలుగా అంచనా వేసినట్లు చెప్పారు.

మైనార్టీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్

విజయనగరంటౌన్ : సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్ డిపార్టుమెంటు ఆధ్వర్యంలో మైనారిటీస్ (ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, బౌద్ధులు, జైనులు) అభ్యర్థులకు ఎస్ఐ, కానిస్టేబుల్, టెట్, డిఎస్‌సి ఉద్యోగాలకు అర్హులైన మైనార్టీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీస్ ఫైనాన్స్ ఇడి కె.కుమారస్వామి తెలిపారు. అర్హులైన అభ్యర్థులకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కోచింగ్ ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ttp://apcedmmwd.org వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని, బయోడేటాను సిఇడిఎం ఆఫీసు, భవాని పురం, విజయవాడ అడ్రస్‌కు పంపించాలని తెలిపారు. వివరాలకు ఫోన్ 0866-2970567 లో సంప్రదించాలని ఇడి కె. కుమారు స్వామి తెలిపారు.

కొండమల్లిపూడిలో సిపిఎం నాయకుల పర్యటన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని కొండమల్లిపూడి గ్రామంలో సిపిఎం బృందం గురువారం పర్యటించింది. తుపాను కారణంగా ఇళ్లు దెబ్బతిన్న 20 గిరిజన కుటుంబాలను పరామర్శించారు. గ్రామంలో ఉన్న కుటుంబాలకు పునరావాస కేంద్రం ఏర్పాటు చేయకపోవడంపై సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు మండిపడ్డారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఇళ్లు కారుతున్నా పిల్లాపాపలతో పస్తులు ఉంటూ ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయాన్ని గిరిజనులు విఆర్ఒ దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారని తెలిపారు. గిరిజనులంటే చిన్నచూపు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే వీరికి నిత్యావసర సరుకులు సరఫరా చేయాలని, ప్రతి గిరిజన గ్రామంలో పునరావాస గృహాలను ప్రభుత్వం నిర్మించాలని తహశీల్దార్ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జిల్లా మద్దిల రమణ పాల్గొన్నారు.

భూసేకరణ వేగవంతం : కలెక్టర్

కంటోన్మెంట్ : జిల్లాలో పలు ప్రాజెక్టుల కోసం చేపడుతున్న భూసేకరణ కు సంబంధించిన అవార్డ్ పాస్ చేయడం, సంబంధిత అధికారులకు లేఖలు రాయడం, ఇతర ప్రాసెస్సింగ్ వేగవంతం కావాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తెలిపారు. గురువారం ముగ్గురు ఆర్‌డిఒలతో కలెక్టర్ తన ఛాంబర్లో భూసేకరణ పై సమీక్షించారు. జాతీయ రహదారుల, భోగాపురం ఎయిర్‌పోర్టు, ట్రైబల్ యూనివర్సిటీ, రెల్లి వద్ద గ్రేహౌండ్స్‌కు కేటాయించిన భూమి, ఎంఎస్ఎంఇల కోసం భూసేకరణ, మురుగునీరు ట్రీట్మెంట్ ప్లాంట్‌కు, రైతు బజార్, విజయనగరం డిగ్రీ కళాశాలకు వేణుగోపాపురం వద్ద కేటాయించిన భూమి, నియోజకవర్గ పరిధిలో ఒక డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు తదితర తదితర వాటికి భూసేకరణపై ఆర్‌డిఒలతో చర్చించారు. సమావేశంలో జె.సి సేదు మాధవన్, ఆర్‌డిఒలు కీర్తి, రామ్మోహన్, సత్యవాణి , సూపరింటెండెంట్‌లు గోవింద, సూర్యలక్ష్మి పాల్గొన్నారు.



కమిషనర్‌కు నోటీసు అందజేస్తున్న కాంట్రాక్టర్లు

బిల్లులు చెల్లించకుంటే పనులు చెయ్యలేం

కమిషనర్‌కు నోటీసు ఇచ్చిన కాంట్రాక్టర్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర పాలక సంస్థలో చేస్తున్న అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిపివేసి నవంబర్ 3న నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని కమిషనర్ నల్లనయ్యకు కాంట్రాక్టరు గురువారం నోటీసు అందజేశారు. గత రెండేళ్లుగా పూర్తి చేసిన పనులకు నేటి వరకు బిల్లులు చెల్లించలేదన్నారు. సకాలంలో పనులు పూర్తి చేసినప్పటికి బిల్లులు చెల్లించకపోవడం సరికాదన్నారు. గత బిల్లుల పేమెంటులు రాక, కొత్త బిల్లులకు పేమెంటులు ఇవ్వకపోవడం వలన తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిని, మానసిక ఒత్తిడికి లోనవుతున్నామని ఆవేదన చెందారు. ఇటీవల కోర్ కమిటీతో జరిగిన చర్చల్లో సానుకూల స్పందన రాకపోవడంతో నవంబర్ 3 నుంచి పనులు నిలుపుదల చేసి ధర్నా చేస్తామని తెలిపారు. నోటీసు ఇచ్చిన వారిలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టులు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.బంగార్రాజు, అర్.రాజ్‌కుమార్, గౌరవాధ్యక్షులు ఎం.లింగారావు, పి.అశోక్, సభ్యులు నరేంద్ర, పి.శ్రీనివాసరాజు, డి.శ్రీనివాస్, వాసుదేవరావు, కె.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాస్, సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రెల్లివలసలో స్వర్గధామం ప్రారంభం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని రెల్లివలసలో మండల పరిషత్ నిధులు రూ. 61 లక్షలతో నిర్మించిన స్వర్గధామాన్ని గురువారం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపిపి మహంతి కళ్యాణి ప్రారంభించారు. స్వర్గధామం చాలా అద్భుతంగా నిర్మాణం చేసారని అన్నారు. రెల్లివలస, చల్లవానితోట పంచాయతీ పరిదిలో అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని వైసిపి మండల పార్టీ అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వర్గదామాలు ప్రతి గ్రామానికి అవసరమన్నారు. ప్రతి మనిషికి చివరిగా ఇచ్చే గౌరవం ఇదేనన్నారు. ప్రారంభోత్సవంలో టిడిపి మండల అధ్యక్షులు మహంతి శంకరావు, రాష్ట్ర కార్యదర్శి పతివాడ తమ్మునాయుడు, వైస్ ఎంపిపిలు ఎన్.సత్యనారాయణరాజు, అల్లాడ సత్యనారాయణ మూర్తి, వైసిపి నాయకులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్ధనరావు, ఇఒపిఆర్‌డి సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

'స్వర్గధామం' నిధుల్లో అవకతవకలు:ఎమ్మెల్యే

రెల్లివలసలో రూ. 60.57 లక్షలతో నిర్మించిన స్వర్గధామంలో అవకతవకలు జరిగాయని ఎమ్మెల్యే లోకం నాగమాధవి విచారణ జరిపించాలని ప్రకటన విడుదల చేశారు. నిధులలో అవకతవకలు, విదానపరమైన లోపాలుపై విచారణకు ఆదేశించామన్నారు. విచారణ పూర్తయ్యే వరకు ప్రారంభోత్సవం నిలిపివేయాలని ఆమె ఆదేశించారు. ఈ మేరకు ఎంపిడిఒ స్పష్టమైన ఆదేశాన్ని జారీ చేశారు. ఒక గ్రామ శ్మశానం కోసం రూ.60.57 లక్షల భారీ నిధులు మంజూరు చేయడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. కేవలం రూ. 5 నుండి 10 లక్షల అంచనా విలువ ఉండే ఈ స్వర్గదామాల పేరుతో వైసిపి ఎంపిపిలు నిధులను దుర్వినియోగం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. రెల్లివలసలో స్వర్గధామం పేరుతో ప్రజాధన దుర్వినియోగానికి మద్దతు ఇచ్చిన జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఇంజినీరింగ్, రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ప్రారంభోత్సవాన్ని ఆపాలని తాను ఆదేశాలు జారీ చేసినా పట్టించుకోకుండా ప్రారంభించడం వల్ల అధికారులతో పాటు జిల్లా పరిషత్ చైర్మన్ కూడా అవకతవకలకు ప్రత్యక్ష మద్దతు ఇచ్చినట్లే అన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను కోరినట్లు వెల్లడించారు.



స్వర్గధామాన్ని ప్రారంభిస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

మండల సమావేశంలో రసాభాస

ప్రజాశక్తి - పూసపాటిరేగ

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి మహంతి కళ్యాణి ఆధ్వర్యంలో గురువారం జరిగిన మండల సర్వ సభ్య సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికార్లు సమాదానం చెప్పలేకపోవడంతో సభ రసాభసాగా మారింది. దీంతో వ్యక్తిగత ఆరోపణలకు దిగారు. ఎంపిపి ఆగ్రహించి సభ అర్ధాంతరంగా ముగిస్తున్నట్లు ప్రకటించారు. ముందుగా కొవ్వాడ అగ్రహారంలో శ్మశాన వాటికి స్ట్రక్చర్‌ను తొలగించారని, ఆ విచారణ ఏమైందని పేరాపురం ఎంపిటిసి పతివాడ తమ్మునాయుడు ఉపాధి హమీ ఎపిఒను ప్రశ్నించారు. ఎన్నిసార్లు ఆ విషయం చెప్పాలంటూ ఎపిఒ అసహనం వ్యక్తం చేసారు. దీంతో పతివాడ ఎంపిటిసి పతివాడ అప్పలనాయుడు స్పందించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాదానం అలాగే చెబుతారా అంటూ ఎపిఒను నిలదీశారు. దీంతో ఇఒపిఆర్‌డి జ్ఞానేశ్వర్రావు కలుగజేసుకొని ఆ సమస్యపై గ్రామ సభలు పెట్టామని, పై అధికారులు విచారణలో ఉందని తెలిపారు. విచారణకు ఎన్ని రోజులు సమయం కావాలని తమ్మునాయుడు నిలదీయడంతో కొవ్వాడ సర్పంచ్ కోట్ల రఘు స్పందించి తమ గ్రామంపై, తనపై వ్యక్తిగతంగా బురద జల్లేందుకు టిడిపి, వైసిపి ఎంపిటిసిలు కలసికట్టుగా దాడి చేస్తున్నారని ఆరోపించారు. దీంతో మరలా సభలో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇలా అసహనానికి గురైన కొవ్వాడ సర్పంచ్ రఘు మైక్‌ను నేలకు కొట్టాడు. దీంతో ఎంపిపి స్పందించి వెంటనే సభను ముగిస్తున్నట్లు ప్రకటించారు. ఫలితంగా కొవ్వాడ సర్పంచి కోట్ల రఘు, వెంపడాం సర్పంచ్ పిన్నింటి కుమార్, కందివలస సర్పంచ్ దేశెట్టి గణేష్ సభ అర్ధాంతరంగా ఎలా ముగిస్తారంటూ సమావేశ మందిరంలో నిరసన వ్యక్తం చేశారు. సూపరిటెండెంట్ శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి జ్ఞానేశ్వర్రావు వారిని బ్రతిమిలాడి బయటకు పంపించారు.



వాగ్వివాదానికి దిగిన సభ్యులు

సబ్ జైల్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ గురువారం స్థానిక సబ్‌జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. కారాగారంలో ఉన్న ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఖైదీల పట్ల వివక్షత చూపించిన యెడల కఠినమైన చర్యలు ఉంటాయని సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్స్ నిర్వహిస్తున్న విధులను పర్యవేక్షించారు. ఖైదీలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నేర ప్రవృత్తిని విడనాడాలని సూచించారు. రిమాండ్ లో ఉన్న ముద్దాయిలకు ఎవరు న్యాయవాది లేకుండా ఉండకూడదని అట్టివారికి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ న్యాయవాదిని ఉచితంగా అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

పేదలకు అండగా సిఎం సహాయనిధి

ప్రజాశక్తి-బొబ్బిలి

సిఎం సహాయ నిధి పేదలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. స్థానిక కోటలో గురువారం సిఎం సహాయ నిధి చెక్కులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ బాబు పాల్గొన్నారు.

జ్వరాలు, డయేరియాపై అప్రమత్తం

ప్రజాశక్తి-కొత్తవలస

తుపాను నేపథ్యంలో తాగునీరు కలుషితం అవుతుందని, జ్వరాలు, డయేరియా విజృంభించే అవకాశం ఉందని పిహెచ్‌సి వైద్యాధికారులు గోపాలకృష్ణ, శీతల్‌వర్మ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కాచిచల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. వేడి ఆహారపదార్థాలు తీసుకోవాలని కోరారు.

సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడా పోటీలు వాయిదా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ సివిల్ సర్వీస్ ఉద్యోగులకు జరగాల్సిన జిల్లా స్థాయి ఎంపిక పోటీలు మొంథ తుపాను కారణంగా నిరవధికంగా వాయిదా వేసినట్లు జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి పోటీల తదుపరి తేదీల వివరాలను త్వరలో తెలియజేస్తామని తెలిపారు.

మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి-బొబ్బిలి

మహిళల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ బాబు అన్నారు. స్థానిక ఆడిటోరియంలో గురువారం మెప్మా ఆధ్వర్యంలో సఖి సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రామలక్ష్మి మాట్లాడుతూ వైద్య పరీక్షలు చేసుకున్న మహిళలకు ఆయుష్మాన్ భారత్ డిజిటల్ కార్డులు ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. ఆరోగ్యంపై ఏడాదికి నాలుగు సార్లు టెలీ కన్సల్టేషన్ సేవలు అందుతాయని, రూ. 5లక్షల ఆరోగ్య బీమా వర్తిస్తుందని చెప్పారు. వెయ్యి మంది నుంచి రక్త నమూనాలు సేకరించి ల్యాబ్ కు పంపించారు. కార్యక్రమంలో టిపిఆర్‌ఒ జగన్మోహన్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

వాలీబాల్‌లో వాగ్దేవి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కొత్తవలస

విజయనగరంలో జరిగిన వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌లో వాగ్దేవి కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. రాష్ట్ర స్థాయి పోటీలకు నలుగురు ఎంపికయ్యారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ కలిదిండి మహేశ్వరరావు, డైరెక్టర్ ప్రదీప్ కుమార్, ప్రిన్సిపల్ సతీష్, రాజ్ కుమార్, సురేష్, లక్ష్మణ్ అభినందించారు.

వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలోని గంగన్నపాడు గ్రామంలో తుపానుతో కురిసిన వర్షాలతో వీధులన్నీ వరదనీటితో నిండిపోయిన విషయం తెలిసిందే. దీంతో ప్రజలకు అంటువ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయని, వెంటనే చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో గురువారం పంచాయతీ కార్యదర్శి విజోక్ ఆధ్వర్యంలో కాలువలు, నీరు నిలువ ఉన్న ప్రాంతాల్లో క్లోరినేషన్ చేపట్టారు. ముందస్తు చర్యల్లో భాగంగా బ్లీచింగ్ పౌడర్ గ్రామమంతా చల్లారు.

ముంపు ప్రాంతాన్ని పరిశీలించిన జనసేన

ప్రజాశక్తి - గజపతినగరం

తుపాను ప్రభావంతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరదనీటితో మండలంలోని పాతబగ్గాం గ్రామంలో ఎరుకులపేటలో ఇళ్లు జలమయం అయ్యాయి. దీంతో ఆ ప్రాంతాన్ని గురువారం జనసేన నాయకులు శ్రీను పరిశీలించారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. భవిష్యత్తులో ముంపు సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని ఆయన హామీనిచ్చారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పిహెచ్‌సి వైద్యాధికారి నాగేంద్రప్రసాద్

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి - సంతకవిటి

సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థినిలు అప్రమత్తంగా ఉండాలని సంతకవిటి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ నాగేంద్ర ప్రసాద్ సూచించారు. గురువారం వాసుదేవపట్నంలోని కెజిబివి పాఠశాలలో విద్యార్థినిలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు చర్మవ్యాధుల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రక్తహీనత నివారణ కోసం ఐరన్, ఫోలిక్ యాసిడ్ సప్లిమెంట్లు తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం నేత్ర పరీక్షలు నిర్వహించి, దృష్టి సమస్యలు ఉన్న ఐదుగురు విద్యార్థినిలకు కంటి అద్దాలు సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రభ, ఆరోగ్య సిబ్బంది ఎస్. వసంతరావు, శ్రీహరినాయుడు, పార్వతి, గౌతమీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వైసిపి కోటి సంతకాల సేకరణ

డెంకాడ :మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి మండల అధ్యక్షుడు పిన్నింటి తమ్మి నాయుడు, నియోజకవర్గ వైసిపి యూత్ అధ్యక్షుడు బడ్డుకొండ ప్రదీప్ నాయుడు ఆధ్వర్యంలో మండలంలోని కొండరాజు పేటలో గురువారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మెడికల్ కాలేజీలు టిడిపి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ సంతకాలు సేకరించారు. నియోజకవర్గ వైసిపి పంచాయతీరాజ్ అధ్యక్షుడు బడ్డుకొండ రమేష్ నాయుడు, నాయకులు వెంకటరెడ్డి సూర్య నారాయణ పాల్గొన్నారు.

190 పశువులకు టీకాలు

డెంకాడ : తుపాను ప్రభావంతో పశువులకు వ్యాధులు రాకుండా పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని పశువైద్యాధికారి శ్రీకాంత్ తెలిపారు. మండలం లోని అక్కివరం, బంటుపల్లి గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి 190 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశామన్నారు.

పునరావాస బాధితులకు నిత్యావసరాలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

తుపాను ప్రభావంతో జిల్లాలోని పలు చోట్ల పునరావాస శిబిరాల్లో తాత్కాలికంగా ఆశ్రయం పొందిన కుటుంబాలకు గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఎస్.కోట మండలం సంతగౌరమ్మపేట, పోతనాపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి బాధిత కుటుంబాలకు సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసరావు, సిఎస్ డిటి జయలక్ష్మి, టిడిపి మండల అధ్యక్షులు జిఎస్ నాయుడు, నాయకులు కూనిరెడ్డి రాము, కిలపర్తి ముత్యాల నాయుడు, గోగాడ అప్పలసత్యం పాల్గొన్నారు.

తెర్లాం : మండలంలో తుపాను బాధిత కుటుంబాలకు అధికారులు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ జి.హేమంత్ కుమార్, ఎంపిడిఒ రాంబాబు, ఎఎంసి చైర్మన్ వెంకట్‌నాయుడు, టిడిపి మండల అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దత్తిరాజేరు : దత్తి, కె.కృష్ణాపురం పునరావాస కేంద్రంలో కుటుంబాలకు టిడిపి మండల అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ హరికిరణ్, సిఎస్ డిటి సత్యనారాయణ, క్లస్టర్ ఇన్‌ఛార్జులు బోడసింగి సత్యంనాయుడు, మితరెడ్డి ఈశ్వరరావు, సర్పంచులు దుర్గమ్మ, వరహాలమ్మ, రామకృష్ణ, చంటి పాల్గొన్నారు.



డెంకాడ : బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న వైసిపి నాయకులు

తుపాను బాధితులకు నిత్యావసరాలు

మెరకముడిదాం: మండలంలో గర్భాం పంచాయితీకి చెందిన రెండు కుటుంబాలకు బైరిపురం పునరావాస కేంద్రంలో నిత్యవసర సరుకులు అందించినట్లు తహశీల్దార్ సులోచన రాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు

రేషన్ సరుకులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

డెంకాడ :మండలంలోని రఘుమండ, బంటుపల్లి గ్రామ పంచాయతీల్లో పునరావసం కేంద్రాల్లో ఉన్న బాధితులకు ఎమ్మెల్యే లోకం నాగ మాధవి రేషన్ సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుపాను వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర రావు, టిడిపి నాయకులు పాణిరాజు, అధికారులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు వైసిపి వితరణ

కొండరాజుపేటలో ఇటీవల కురిసిన వర్షాలకు ఇల్లు కోల్పోయిన బాధితులకు నెల రోజులకు సరిపడే నిత్యావసర సరుకులను వైసిపి నియోజకవర్గం యూత్ వింగ్ అధ్యక్షుడు బడ్డుకొండ ప్రదీప్ నాయుడు, వైసిపి మండల అధ్యక్షుడు పిన్నింటి తమ్మినాయుడు అందజేశారు. సర్పంచ్ ప్రతినిధి సరగడ బంగారు రెడ్డి ఆర్థిక సహాయంతో చేసిన ఈ కార్యక్రమంలో మోపాడ సర్పంచ్ ప్రతినిధి బడ్డుకొండ రమేష్ నాయుడు, వైస్ సర్పంచ్ గొలగాని సూర్యనారాయణ, నాయకులు డి.వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసర సరుకులు అందజేత

విజయనగరంకోట : విజయనగరం మండలం పరిధిలోని ఆరు పునరావాస కేంద్రాల్లో ఉన్న 61 కుటుంబాలకు చెందిన 107 మంది బాధితులకు నిత్యావసరలైన 25కేజీల బియ్యం బస్తా, కేజీ కంది పప్పు, నూనె, ఉల్లిపాయలు, బంగాళా దుంపలు అందజేశారు. ఒక్కొక్క వ్యక్తి కి వెయ్యి రూపాయలు చొప్పున కుటుంబానికి రూ.3వేలు చొప్పున రూ.1,02,000 అందజేసినట్లు తహశీల్దార్ కూర్మనాధరావు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ ఐ రాజు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గంటా పోలినాయుడు, టిడిపి పట్టణ అధ్యక్షులు గంటా రవి, కార్యదర్శులు కోదండరామ్, మండల కార్యదర్శి పాశి అప్పలనాయుడు, ఎంపిటిసి రాజేష్ బాబు, రాష్ట్ర యాదవ సంఘం డైరెక్టర్ ప్రసాద్ లక్ష్మీ వరప్రసాద్, శివ వేచలపు శ్రీనివాసరావు, మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.



శృంగవరపుకోట : బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి



విజయనగరంటౌన్ : బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న టిడిపి నాయకులు

రైతులను ఆదుకుంటాం

ప్రజాశక్తి-రేగిడి

వరి, చెరకు, మొక్కజొన్న ఇతర పంటలు నాశనమైన రైతులను తక్షణమే పంట నష్టపరిహారం ఇచ్చి ఆదుకుంటామని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ భరోసా ఇచ్చారు. చెలికాని వలస, రేగిడి తదితర గ్రామాల్లో పంట నష్ట పోయిన రైతులను ఓదార్చి పంటలను పరిశీలించారు. ఎమ్మెల్యే ద్విచక్ర వాహనంపై వెళ్లి వాగులు, వంకల ఉధృతిని పరిశీలించారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పంట నష్టం అంచనా వేయాలని తహశీల్దార్ ఐ. కృష్ణలత, ఎఒ శ్రీనివాసరావుకు ఆదేశించారు.

వంగర: మండలంలోని కొప్పర నుంచి కొండచాకరాపల్లి వరకు ట్రాక్టర్‌తో వెళ్ళి నీట మునిగిన పంటలను ఎమ్మెల్యే కోండ్రు మురళీ పరిశీలించారు. కొప్పర నుంచి కొండచాకరాపల్లికి రక్షణ గోడ నిర్మించాలని ఎమ్మెల్యేను రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు లచ్చు బుక్త కృష్ణమూర్తి, బొత్స వాసుదేవరావు నాయుడు, పిన్నింటి మోహనరావు, మజ్జి గణపతి తదితరులు పాల్గొన్నారు.

రాజాం: మండలంలోని గడ్డిముడదాం, అమరం, దోసరి గ్రామాల్లో నీట మునిగిన సుమారు 493 ఎకరాల్లో వరి పంటను వ్యవసాయశాఖ ఎడి కె.చంద్రరావు గురువారం పరిశీలించారు. రైతులకు ఇబ్బంది లేకుండా పంట నష్టాన్ని వేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఒ రఘునాథ్, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలో చొల్లంగిపేటలో నీట మునిగిన వరి పంటను జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు గురువారం పరిశీలించారు. వరి పంటకు నష్టపరిహారం కింద హెక్టారుకు రూ.25వేలు ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ సంగీత, వ్యవసాయ విస్తరణ అధికారి బి.రామకోటి, సర్పంచ్ కోరాడ కనకరాజు, రైతులు పాల్గొన్నారు.

గుర్ల: కష్ట కాలంలో ఉన్న ప్రతి ఒక్కరినీ ఈ ప్రభుత్వం ఆదుకుంటుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి రామ్‌మల్లిక్ నాయుడు అన్నారు. మండలంలో కోట గంద్రేడులో వరి, పాలవలసలో బొప్పాయి పంట నష్టపోయిన రైతు కుటుంబాలను పరామర్శించారు. అనంతరం పునరావాసంలో ఉన్న బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఆదిలక్ష్మి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి సన్యాసినాయుడు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దాసరి శివప్రసాద్, టిడిపి జిల్లా కార్యదర్శి సొసైటీ అధ్యక్షులు కిరణ్ కుమార్, టిడిపి మండల అధ్యక్షుడు సిహెచ్ మహేశ్వరరావు గూడెం సొసైటీ అధ్యక్షులు పిల్ల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు

భోగాపురం: మండలంలో దెబ్బతిన్న పంటలను గురువారం రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు నందిగాంలో పరిశీలించారు. దెబ్బతిన్న పంటల నివేదకను తయారు చేసి ఇవ్వాలని వ్యసాయ అధికారులకు సూచించారు. ఆయన మాట్లాడుతూ నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభత్వం ఆదుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, ఎఒ కె. హైమావతి, ఏఎంసి డైరెక్టర్ గరే వెంకటరమణ, సర్పంచ్ గరే మురళి, ఎంపిటిసి పిడుగు సత్యం తదితరులు పాల్గొన్నారు.



రేగిడి : కుళ్లిపోయిన వరిపంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

విద్యుదాఘాతంతో రెండు ఆవులు మృతి

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలోని కొత్తకర్ర గ్రామంలో సబ్బి పైడితల్లి, సబ్బి రామప్పమ్మకి చెందిన రెండు ఆవులు గురు వారం విద్యుదాఘాతంతో మృతి చెందాయి. గర్భాం రెవెన్యూ పరిధిలో ఉన్న భూమిలో మేతకు వెళ్లి విద్యుత్ షాక్‌తో చనిపోయినట్లు తహశీల్దార్ ఆకుల సులోచనరాణి తెలిపారు. విద్యుత్ సిబ్బంది అప్రమత్తమై విద్యుత్తు సరఫరా నిలుపుదల చేసినప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. తహశీల్దార్‌తో పాటు పశువైద్యాధికారి, విద్యుత్ సిబ్బంది, స్థానిక నాయకులు బూర్లె నరేష్ కుమార్, బూర్లే సురేష్ కుమార్, తాడ్డి శ్రీధర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.



చనిపోయిన ఆవు వద్ద బాధితురాలు



నాగావళి నది ఒడ్డున గ్రామస్తులతో చర్చిస్తున్న డ్వామా పీడీ శారదాదేవి

వర్షానికి కారిపోతున్న భవనం

తడిసిన మందులు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో బల్లంకిలోని హోమియో ఆస్పత్రిలో మందులు తడిచిపోయాయి. ఆస్పత్రి భవనం కారడం వల్ల మందులన్నీ తడవడంతో రోగులకు ఇవ్వడం ఇబ్బందిగా మారిందని హోమియో వైద్యాధికారి శిరీషా తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఆస్పత్రి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రోగులు కోరుతున్నారు.

చురుగ్గా పారిశుధ్య పనులు

వేపాడ మండలంలోని ఆకులసీతంపేట గ్రామంలో పారిశుధ్య పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ ఆదేశాల మేరకు ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి జి.సౌజన్య పర్యవేక్షణలో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న కాలువల్లో పూడికను తొలగించారు. ఖాళీస్థలాల్లో చేరిన నీటిని తొలగించి, బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో ఎఎన్ఎం, ఆరోగ్య కార్యకర్త పాల్గొన్నారు.



వర్షానికి కారిపోతున్న హోమియో వైద్యశాల

కెఆర్‌పురంలో అధికారుల మకాం

ప్రజాశక్తి-సంతకవిటి

మండలంలోని నదీ తీర ప్రాంతాల్లో తుపాను ప్రభావంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అధికారులు అక్కడే తిష్ట వేసి పరిశీలిస్తున్నారు. నాగావళి నది నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో కె.ఆర్.పురం గ్రామానికి నీరు చేరే ప్రమాదం ఏర్పడింది. ఈ నేపథ్యంలో అధికారులు తక్షణమే గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. మండల ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ ఎస్.శారదాదేవి, తహశీల్దార్ బి. సుదర్శన్ రావు, ఎంపిడిఒ కె.సురేష్ కుమార్, ఎస్ఐ ఆర్. గోపాలరావు తదితరులు గ్రామాల్లో తిష్ట వేసి వరద నీరు గ్రామంలోకి రాకుండా జెసిబిలు, ట్రాక్టర్లు ఉపయోగించి మట్టితో గట్టులు కట్టించారు. నది నీటి మట్టం మరింత పెరిగితే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు కూడా సిద్ధం చేశారు. అధికారులు నదీతీర గ్రామాలైన జావాం, రంగరాయపురం, హొంరాం, తమరాం, పి.జే.పేట ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ హరినాథ్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కష్టపడి పనిచేస్తే గుర్తింపు

ఆర్అండ్‌బి డిఇ సత్యఫణీశ్వర్

ప్రజాశక్తి-విజయనగరం

తీసుకున్న పనిని ఇష్టంతో కష్టపడి పనిచేసి పూర్తి చేసినప్పుడు మంచి గుర్తింపు వస్తుందని రోడ్లు భవనాల శాఖ ఉపకార్యనిర్వాహక ఇంజినీర్ కె .సత్య ఫణీశ్వర్ అన్నారు. ఆ విధంగా తాను పనిచేయడం వల్ల ఆ ప్రాంత ప్రజలందరితో మంచి సంబంధాలు ఏర్పడ్డాయని, తద్వారా ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా విజయవంతంగా పూర్తి చేయగలిగానని చెప్పారు. ఈ నెలాఖరుకు ఉద్యోగవిరమణ చేస్తున్న సందర్భంగా ప్రజాశక్తితో తన అనుభవాలను పంచుకున్నారు. విశేషాలు ఆయన మాటల్లో..

' మాది తూర్పు గోదావరి జిల్లా మండపేట మండలం తాపేశ్వరం గ్రామం. 1963 అక్టోబర్ 6న విశాఖపట్నంలో కె.సత్యనారాయణ మూర్తి, సరోజదేవి దంపతులకు మొదటి సంతానంగా జన్మించాను. నాకు తమ్ముడు, ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. సోదరుడు సత్యభాస్కర్ కూడా ఆర్అండ్‌బి డిఇ గా పని చేస్తున్నాడు. ఒక బావ ట్రాన్స్‌కోలో చీఫ్ ఇంజినీర్ పనిచేసి రిటైర్డ్ అయ్యారు. మరొకరు ఎస్ఇ గా చేస్తున్నారు. 1997లో వీణారాణితో నాకు వివాహమైంది. మా పిల్లలు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా స్థిరపడ్డారు. నేను ఇంజినీరింగ్ పూర్తయిన వెంటనే గాయత్రి ఇంజినీరింగ్ కంపెనీలో ఇంజినీర్‌గా 1986 నుంచి 1991 వరకు పనిచేసాను. కోరాపుట్ రాయగడ రైల్వే లైన్ పనులు నా కాలంలో జరిగాయి. తరువాత ఎపిపిఎస్‌సి ద్వారా ఎఇ గా ఎంపికై 1992లో రాజాంలో ఆర్అండ్ బి శాఖ లో అసిస్టెంట్ ఇంజనీర్ గా ఉద్యోగజీవితం ప్రారంభించాను. 1994 వరకు అక్కడే పనిచేశాను. ఆ కాలంలోనే సువర్ణముఖి నదిపై మడ్డువలస హైలెవెల్ బ్రిడ్జ్ నిర్మించాం. 1994 నుంచి 95 వరకు హరిపురం, 1995 నుంచి 2000 వరకు శ్రీకాకుళం ఎన్ హెచ్ సర్కిల్ లో పనిచేయగా 2000 నుంచి 2007 వరకు సీతానగరం లో చేశాను. 2007 నుంచి 2013 వరకు పాలకొండలో పని చేస్తుండగా ఉద్యోగోన్నతి లభించింది. విజయనగరం డిఇ గా 2013 నుంచి 2019 వరకు తరువాత 2019 నుంచి 2024 వరకు విశాఖపట్నంలో విధులు నిర్వహించాను. బదిలీ పై 2024 లో విజయనగరం వచ్చాను. తాను రాజాం, పాలకొండ ప్రాంతాల్లో పనిచేసిన కాలంలో సువర్ణముఖి నదిపై మడ్డువలస దగ్గర నిర్మించిన హైలెవెల్ బ్రిడ్జి నిర్మించడం మరచిపోలేనిది. పాలకొండలో పనిచేసినపుడు పాలకొండ -హడ్డుబంగి రోడ్డు, జొన్నవలస తెట్టంగి రోడ్డు, విజయనగరం- పాలకొండ రోడ్డు, విజయనగరంలో ఇవిఎం గోడౌన్ల నిర్మాణం, సీతంపేట డిగ్రీ కాలేజీ భవన నిర్మాణం నా ఉద్యోగ జీవితంలో తీపిగుర్తులుగా మిగిలిపోతాయి.



అవార్డులు ప్రశంసలు

నా 33 ఏళ్ల సర్వీస్ లో 17 జిల్లా స్థాయి అవార్డులు పలువురు మంత్రులు, కలెక్టర్లు, ఐటిడిఎ పిఒల చేతులమీదుగా అందుకున్నాను. రాష్ట్ర స్థాయిలో తమ శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ నుంచి 2022లో ఉత్తమ అధికారి గా ప్రశంసలు అందుకున్నాను. నా ఉద్యోగ జీవితంలో సహకరించిన వారందరికీ ధన్యవాదాలు. '

కూలిన ఇంటిని పరిశీలించిన యశస్వి

ప్రజాశక్తి-విజయనగరంకోట

తుపాను వల్ల నగరంలోని విటి. అగ్రహారంలో మూడు పూరిళ్లు కూలిపోయాయి. విషయం తెలుసుకున్న జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి గురువారం బాధితులైన పొదిలాపు పాపునాయుడు, లావేటి గౌరీ, గ్రంథం లక్ష్మి ఇళ్లను పరిశీలించారు. అనంతరం జనసేన నాయకులు రౌతు సతీష్ సొంత డబ్బులతో ఏర్పాటు చేసిన 25 కేజీల బియ్యం, కేజీ ఉల్లిపాయలు, కేజీ బంగాళాదుంపలు, కేజీ నూనె, కేజీ టొమాటోలు, కేజీ కందిపప్పును బాధితులకు యశస్విని అందజేశారు. కార్యక్రమంలో జనసేన నాయ కులు సవదాల హరి , ఉప్పిడి చక్రధర్ , బూర్లి ధనంజయ , రెడ్డి సాగర్ , కొలూరి దిలీప్ , పొదులాపు మహేష్, ఎఎంసి వైస్ చైర్మన్ బొబ్బాది చంద్ర నాయుడు పాల్గొన్నారు



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న డిఎస్‌పి గోవిందరావు, సిఐ లక్ష్మణరావు

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

ప్రజాశక్తి-గంట్యాడ

ఆటో డ్రైవర్లు రహదారి భద్రతా నియమాలను పాటించాలని డిఎస్‌పి ఆర్.గోవిందరావు, రూరల్ సిఐ బి.లక్ష్మణరావు అన్నారు. గురువారం మండలంలోని మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. కొటారుబిల్లి జంక్షన్‌లోని ఆటో డ్రైవర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా జాగ్రత్తగా చేర్చాలన్నారు. చంద్రంపేట, వసంత, లక్కిడాం, రామవరం, సిరిపురం, కొర్లాం, పొల్లంకి గెడ్డలు, వాగుల గురించి ప్రయాణికులకు తెలియజేయాలని అన్నారు. గంజాయి తాగినా, అక్రమంగా రవాణా చేసినట్లు తెలిసినా గంట్యాడ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం రహదారి భద్రతా నియమాలు గురించి పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో గంట్యాడ ఎస్ఐ సాయికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న సిఐ నారాయణమూర్తి

స్పందించారు.. సాయం చేశారు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ప్రజాశక్తిలో గురువారం ప్రచురితమైన 'గిరిజనులను ఆదుకోవడంలోనూ చిన్నచూపే' కథనానికి అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, ఎంపిడిఒ సతీష్ సహకారంతో ఏర్పాటు చేసిన నిత్యావసర సరుకులను గురువారం శృంగవరపుకోట అర్బన్ పోలీస్ స్టేషన్ సిఐ వి.నారాయణమూర్తి గిరిజనులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ. దారపర్తి పంచాయతీ పరిధిలో 120 మంది గిరిజనులు కొండదిగువ దబ్బగుంట గ్రామానికి వచ్చారని తెలిపారు. వారికి ఒక్కొక్కరికి మూడు కేజీల బియ్యం, బంగాళదుంపలు, ఉల్లిపాయలు, కూరగాయలు, నూనె ప్యాకెట్, గుడ్లు తదితర నిత్యావసర సరుకులను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

నిరాశ్రయుల ఆకలి తీర్చిన సత్యసాయి ట్రస్టు

మండలంలో పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న వారికి శ్రీసత్యసాయి దివ్యామృతం ట్రస్టు మూడు రోజులపాటు ఆహారాన్ని సరఫరా చేసింది. బొడ్డపాడు, ముషిడిపల్లి, మూలబొడ్డవర, కాపుసోంపురం, పోతనపల్లి, సంతగౌరమ్మపేట తదితర గ్రామాల్లో పునరావాస కేంద్రాల్లో నిరాశ్రయుల ఆకలి తీర్చింది.

ముందస్తు చర్యలతో నష్టం జరగలేదు

ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు

ప్రజాశక్తి-విజయనగరం కోట

మొంథా తుపానుకు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు సమర్థవంతంగా ఎదుర్కొని ఎటువంటి ప్రాణ నష్టంగాని, ఆస్తి నష్టం గాని జరగకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు హర్షణీయమని ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. తుపాను ప్రభావంతో విజయనగరం జిల్లాలో ముందస్తుగా అధికారులు, ప్రజాప్రతినిధులు తో సమన్వయం చేసుకుంటూ చర్యలు చేపట్టడం ద్వారా ఎటువంటి ప్రాణ నష్టాలు జరగలేదన్నారు. ఎక్కడక్కడ పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రజలను తరలించడంతో ఎటువంటి ప్రమాదము జరగలేదన్నారు. మంత్రులను, ఎమ్మెల్యే లను రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ సర్పంచ్ వార్డు సభ్యుల వరకు సిఎం అప్రమత్తం చేశారని తెలిపారు. జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు అందరూ సమర్థవంతంగా పని చేస్తారన్నారు. పునరావాస బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం 15 రోజుల కు సరిపోయే నిత్యావసర సరుకుల అందిస్తున్నట్లు తెలిపారు.

కృత్రిమ అవయవాలు పంపిణీ

ప్రజాశక్తి -కొత్తవలస



కృత్రిమ అవయవాలు పంపిణీ చేస్తున్న సిఇఒ

శ్రీగురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సౌత్ ఆసియా ఎల్‌పిజి సహకారంతో గురువారం కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. సౌత్ ఆసియా ఎల్‌పిజి సిఇఒ రిచాషిండే, రామనాథ్ వీటిని సుమారు 250 మంది వికలాంగులకు అందజేశారు. అనంతరం ఉప్పలపాటి మెమోరియల్ కేన్సర్ హాస్పిటల్‌ను వారు సందర్శించారు. ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీశ్ కుమార్ చేస్తున్న సేవలను కొనియాడారు. వికలాంగులకు వైద్య సేవలు, మందులు అందించారు. వృద్ధులకు బియ్యం, అంధులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీశ్ కుమార్, ట్రస్ట్ వైస్ చైర్మన్ డాక్టర్ ఫణేంద్ర పాల్గొన్నారు.

జెఎన్‌టియు గురజాడను అభివృద్ధి చేయండి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జెఎన్‌టియు జివిని అభివృద్ధి చేయాలని విసి వివి సుబ్బారావును ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సుంకరి రమణమూర్తి కోరారు. గురువారం ఆయన విసిని కలిశారు. గతంలో విశ్వవిద్యాలయంలో జరిగిన అనేక అవినీతి అక్రమాలను వివరించారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఉన్న ఏకైక సాంకేతిక విశ్వవిద్యాలయం ఇదొక్కటేనని, దీనిని అభివృద్ధి పరచాల్సింది పోయి స్వార్థపూరిత ఆలోచనలతో గత పాలకులు తీసుకున్న అవినీతి నిర్ణయాలతో విశ్వవిద్యాలయ ప్రతిష్ట దిగజారిందని తెలిపారు. విసి సుబ్బారావు స్పందిస్తూ, విశ్వవిద్యాలయ ప్రతిష్ట ను పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావాడ సీతారాం, డాక్టర్ అల్లాడి వీరభద్రరావు, డాక్టర్ దంతేశ్వర పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వనరులను కాపాడుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రపంచ పొదుపు దినోత్సవం సందర్భంగా గురజాడ పబ్లిక్ స్కూలులో పొదుపు అనే అంశంపై విద్యార్థులకు మదర్ తెరిసా సేవా సంఘం, బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన అవగాహన సదస్సు నిర్వహించారు. సేవా సంఘం అధ్యక్షులు- త్యాడ ప్రసాద్ పట్నాయక్ మాట్లాడుతూ, పొదుపు అనేది ముఖ్యంగా విద్యార్థులకు, యువతకు చాలా అవసరమని అన్నారు. విద్యార్థులకు నీరు, విద్యుత్తు, ఆహారం, కాలం, ధనం వంటి వాటి మీద అవగాహన కల్పించారు. గురజాడ స్కూల్ హెచ్‌ఎం పూడి శేఖర్, సైన్స్ హెచ్‌ఒడి పి.రమేష్, స్కూల్ ఇన్చార్జ్ బి.పద్మలత, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యకళాశాలల ప్రయివేటీకరణతో నష్టం

మాజీ ఎమ్మెల్యే కడుబండి

ప్రజాశక్తి-కొత్తవలస

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణతో పేద, సామాన్య విద్యార్థులకు నష్టమని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. కొత్తవలస మండలంలోని చిన్నిపాలెం, ఉత్తరపల్లి, అప్పన్నపాలెం పంచాయతీల్లో మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా గురువారం సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి చేపట్టే ఉద్యమానికి ప్రజలంతా మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, వైసిపి మండల అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గొరపల్లి శివ, నాయకులు బొంతల వెంకట్రావు, సింగంపల్లి గణేష్, పవన్, కోన దేముడు, గొరపల్లి రవికుమార్, విరోతి కొండలరావు, పల్ల భీష్మ పాల్గొన్నారు.



ఎస్.కోట : సంతకాలు సేకరణలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కడుబండి, వైసిపి నాయకులు



మెరకముడిదాం : సంతకాలు చేయిస్తున్న వైసిపి నాయకులు

ప్రైవేటు కరణకు వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ

మెరకముడిదాం : మండలం లో చినబంటుపల్లి, బొడందర వలస, లెంకపేట గ్రామాల్లో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణలో భాగంగా వైసిపినాయకులు సంతకాల సేకరణ చేపట్టారు. మండల వైసిపి అధ్యక్షులు కోట్ల విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ సంతకాల సేకరణ జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై ఎండగట్టారు. పేదలకు వైద్యం అందించాలని స దుద్దేశంతో ఈ మెడికల్ కళాశాలలు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నిర్మిస్తే తెలుగుదేశం ప్రభుత్వం వ్యాపార దృక్పథంతో ప్రైవేటుపరం చేయడం సమంజసం కాదని అన్నారు. కార్యక్రమంలో వైయస్సార్ పార్టీ సీనియర్ నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, ప ప్పల కృష్ణమూర్తి, బూర్లె నరేష్ కుమార్, చిన్న బంటుపల్లి ఎంపిటిసి పల్లి బంగారమ్మ, చిన్న బంటుపల్లి వైఎస్ఆర్ నాయకులు పల్లి కృష్ణమూర్తి నాయుడు,లెంక త్రినాధ తదితరులు పాల్గొన్నారు.

లెండిలో కాన్ఫరెన్స్

ప్రజాశక్తి- డెంకాడ

లెండి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో గురువారం మూడు రోజులు పాటు నిర్వహించనున్న అంతర్జాతీయ కాన్ఫరెన్స్ ప్రారంభమైంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటింగ్ టెక్నాలజీస్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ డేటా అనలిటిక్స్ వంటిపై సమీక్షించారు. కాన్ఫరెన్స్‌లో భాగంగా విభిన్నంగా ఏర్పాటు చేసిన ప్రాజెక్ట్ ఎక్స్పో ఆకట్టుకుంది. ఈ కాన్ఫరెన్స్ విద్యావేత్తలు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులకు తమ అభిప్రాయాలు పంచుకునేందుకు, తెలివైన కంప్యూటింగ్ వ్యవస్థల భవిష్యత్తును ఆకారమిచ్చే క్రియాత్మక అభిప్రాయాలు పరిశీలించేందుకు ఉత్తమ వేదికగా నిలిచింది. గురువారం తొలిరోజు ప్రాజెక్ట్ ఎక్స్పోలో వివిధ ఇంజనీరింగ్ శాఖలకు చెందిన విద్యార్థులు, పరిశోధకులు రూపొందించిన అత్యాధునిక నమూనాలు, పరిశోధనల ప్రదర్శనగా నిలిచాయి. ఎఐ హెడ్ అండ్ జనరేటివ్, నాస్కాం బ్రాండ్ అంబాసిడర్ డాక్టర్ కార్తికేయన్ సమీనాథన్ మాట్లాడుతూ వినూత్న డిజిటల్ సాంకేతికతలు పరిశ్రమలను, విద్యారంగాన్ని ఆధునికంగా ఎలా మలుస్తున్నాయో వివరించారు. ప్రిన్సిపాల్ వివి.రామారెడ్డి, వైస్ ప్రిన్సిపల్స్ వి.అంజిరెడ్డి, హరిబాబు తమ్మినేని అద్యాపకులు, పాల్గొన్నారు.

నాటు సారా నిర్మూలనకు కృషి

ప్రజాశక్తి - కురుపాం



సమావేశంలో మాట్లాడుతున్న సిఐ

గంజాయి, నాటుసారా అక్రమ రవాణా నిర్మూలనకు అటవీ, ఎక్సైజ్, పోలీస్ శాఖ సిబ్బంది కలిసికట్టుగా పనిచేయాలని చినమేరంగి, ఎల్విన్ పేట సిఐలు తిరుపతిరావు, హరి అన్నారు. గురువారం కురుపాం పోలీస్ స్టేషన్ వద్ద ఎల్విన్ పేట, చినమేరంగి సర్కిల్ పరిధిలో గల మూడు శాఖలతో కలిసి సంయుక్త సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక శాఖ దగ్గర ఉన్న సమాచారం మరో శాఖకు పంచుకొని మూడు శాఖల సంయుక్తంగా కలిసి పనిచేస్తే గంజాయి, నాటుసార అక్రమ నిర్మూలన సాధ్యమవుతుందని అన్నారు. ఈ సమావేశంలో అటవీ శాఖ అధికారి గంగరాజు, ఎక్సైజ్ ఎస్ఐ జె.రాజశేఖర్, సర్కిల్ పరిధిలో గల ఎస్ఐలు పి.నారాయణరావు, శివప్రసాద్, నీలకంఠ రావు తదితరులు పాల్గొన్నారు.

ఇంకా నీటిలోనే పంటలు

ప్రజాశక్తి - కొమరాడ

తుఫాన్ నేపథ్యంలో కురుస్తున్న వర్షాలకు మండలంలోని పూడేష్ పంచాయతీ గుమడంగి, అర్తాం, విక్రాంపురం, సోమినాయుడు వలస తదితర గ్రామాల్లో వరి పంట పూర్తిగా నీటిలో మునిగిపోయాయి. అలాగే కుంతేసు పంచాయతీ మహామందుల భానుమతి ఇంటి గోడ కూలిపోయింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోడ నానిపోవడంతో కూలియింది. గోడ పడిపోయిన సమయంలో ప్రజలు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

సీతానగరం ఆయకట్టు పరిశీలన

సీతానగరం: మండలంలోని కొత్తవలస వద్ద ఉన్న సువర్ణముఖి నదిపై ఉన్న సీతానగరం ఆయకట్టు ప్రాజెక్టు నీటిని ఆయకట్టు చైర్మన్ తెంటు వెంకట అప్పలనాయుడు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి తీవ్రతను బట్టి ఆయకట్టులో పరిసర ప్రాంతాలను దిగువున్న పంట భూములను పరిశీలించి రైతులకు ముందస్తు సమాచారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డిఇ భాస్కర్ రావు, జెఇ శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బందితో పాటు రైతులు పాల్గొన్నారు.

ఊపిరి పీల్చుకున్న అధికారులు

వీరఘట్టం: తుపాను వల్ల మండలంలోని ఎక్కడ ఎటువంటి ప్రాణహాని, ఆస్తి నష్టం వాటిల్లకపోవడంతో మండల స్థాయి అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కొట్టుగుమ్మడ, నడుకూరు, తలవరం, పనస నందివాడ, గ్రామాల్లో వరి పంట నేలకొరిగింది తప్ప ఎక్కడా పూర్తిస్థాయిలో పంట నష్టం వాటిల్లకపోవడంతో అన్నదాతలు కూడా ఊపిరి పీల్చుకున్నారు. మండల కేంద్రంతో పాటు బూరుగా, సిఎస్ఆర్ పేట, కొట్టు గుమ్మడ తదితర గ్రామాల్లో క్యాబేజీ పంట నష్టం వాటిల్లడంతో పంట నష్టాలు అంచనాలు వేసేందుకు ఉద్యానవన శాఖ అధికారులు సమాయత్తం అవుతున్నారు. ఏది ఏమైనా తుఫాను తీవ్రత మండలంపై పెద్దగా లేకపోవడంతో అటు అధికార యంత్రాంగం ఇటు ప్రజలకు ఊపిరి పీల్చుకున్నారు.



వీరఘట్టం: నీటిలో ఉన్న వరి చేను


నష్టపోయిన రైతులను ఆదుకుంటాం : మంత్రి

ప్రజాశక్తి - పాచిపెంట

తుఫాను ప్రభావంపై జిల్లా, మండల స్థాయి అధికారులతో రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి మంగళవారం సమీక్షించారు. నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. గ్రామస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. అత్యవసర వనరులు, రక్షణ బృందాలు, వైద్య సేవలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. అలాగే తుఫాను ముందు, తర్వాత అన్ని పరిస్థితులను పర్యవేక్షిస్తూ ప్రజలపై ఎటువంటి ప్రభావం పడకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలన్నారు. అనంతరం పెద్దగెడ్డ జలాశయాన్ని సందర్శించి నీటిమట్టం గేట్లు నియంత్రణపై ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ డి.రవి, ఎంపిడిఒ బివిజె పాత్రో, మండల టిడిపి అధ్యక్షులు గూడేపు యుగంధర్, ఎఎంసి చైర్మన్ ముఖీ సూర్యనారాయణ, నాయకులు మతల బలరాం, కొత్తల పోలినాయుడు, పూసర్ల నర్సింగరావు, చల్లా కనక, పల్లేడ ఉమామహేశ్వరరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల బృందం పంట నష్టాల పరిశీలన

తుఫానుకు జరిగిన నష్టాలను కృషి విజ్ఞాన కేంద్రం రక్తకుంటుబాయి శాస్త్రవేత్తల బృందం మండలంలోని మోసూరు, తాడూరు పర్యటించింది. ఈ బృందంలో సస్యరక్షణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ అమృత వీణ, పశుసంవర్ధక శాఖ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ అను హెూమ్ సైన్స్ శాస్త్రవేత్త వై.ఉమాజ్యోతి ఉన్నారు. ఎఎంసి చైర్మన్ సూర్యనారాయణతో కలిసి తుఫాన్ వల్ల దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. గింజ మొలకెత్తకుండా రంగు మారకుండా ఉండాలంటే ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలని తెలిపారు. పత్తి పంటకు నీరు తీసివేసి 25 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ వేసుకుని ప్రాఫికొనజోల్ ఒక మిల్లీ లీటరు ఇమిడా క్లోప్రేడ్ 0.4 మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. వరి పంటకు అవసరాన్ని బట్టి సస్యరక్షణ చేయాలని కోరారు. కార్యక్రమంలో విఎఎ గోపాలకృష్ణ, ప్రకృతి సిద్ధ సిఆర్పి సురేష్ పాల్గొన్నారు



పాచిపెంట: ఒట్టిగెడ్డను పరిశీలిస్తున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి

అన్నదాతకు అండగా ఉంటాం : ఎమ్మెల్యే

గుమ్మలక్ష్మీపురం: కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో జియ్యమ్మవలస మండలం డంగభద్ర పరిసర ప్రాంతాల్లో నష్టం వాటిల్లిన పంటల పరిస్థితిని గురువారం ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. వర్షాన్ని కూడా లెక్కచేయకుండా నేలకొరిగిన వరి, పత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. అనంతరం పంట నష్టపోయిన రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పంట నష్టం జరిగిన రైతులు ఇబ్బంది పడకుండా తక్షణ నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కావున వ్యవసాయ అధికారులు వెంటనే నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి నివేదికను ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారు. అనంతరం గడసింగుపురానికి సమీపాన గల ఉమ్మగెడ్డను పరిశీలించారు. ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. డంగభద్రలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలోని తుఫాన్ బాధితులకు నిత్యవసర సరుకులు, ఆర్థిక సహాయం అందజేశారు. ఈ పర్యటనలో ఎఎంసి చైర్మన్ కద్రక కళావతి, మండల కన్వీనర్ జోగి భుజంగరావు, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎంపిడిఒ, తహశీల్దార్, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నిత్యవసర వస్తువులు పంపిణీ

మండలంలోని గొయిపాక పంచాయతీ టంకు గ్రామంలో తుపాను వల్ల దెబ్బతిన ఇల్లును గురువారం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పరిశీలించారు. పునరావాసం కల్పించిన గ్రామానికి చెందిన బాధితులకు నిత్యవసర సరుకులు అందజేశారు. పుసాబడి గ్రామంలో వర్షాలకు గోడకూలిన ఇంటిని పరిశీలించారు. వారికి ఆశ్రయం ఏర్పాటు చేయాలని రెవెన్యూ సిబ్బందికి ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట టిడిపి మండల అధ్యక్షులు అడ్డాకుల నరేష్, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్పర్సన్ కద్రక కళావతి, నియోజకవర్గ మహిళా కార్యదర్శి వెంపటాపు భారతి, బిజెపి ఎస్‌టి మోర్చా జిల్లా అధ్యక్షులు నిమ్మక సింహాచలం, మాజీ కన్వీనర్ పాడి సుదర్శన్‌రావు, ఎంపిడిఒ శ్రీనివాసరావు, తహశీల్దార్ శేఖర్, ఎంఇఒ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : తుఫాన్ నేపథ్యంలో మండలంలోని మొండెంఖల్ పంచాయితీలో గల గోర్జిపాడులో కూలీలన ఇల్లును ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరి గురువారం పరిశీలించారు. అనంతరం పునరావాస కేంద్రంలో ఉన్న కుటుంబాలకు 25 కేజీల బియ్యం, నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె. జయ, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంజిత్ కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వాటర్ బాటిళ్లు పంపిణీ

వీరఘట్టం: మండలంలోని చినగోర మోడల్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు గురువారం వీరఘట్టం గ్రామానికి చెందిన డాక్టర్ భోగి సంపత్ కుమార్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని, వీటిని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు వేడిచేసిన నీరు తాగాలని, అందుకు ఈ బాటిళ్ల ఉపయోగపడతాయని ప్రధానోపాధ్యాయులు కెటివి పోలినాయుడు అన్నారు. కార్యక్రమంలో డి.బాలరాజు, కె.ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరద బాధితులకు బియ్యం పంపిణీ

పాలకొండ : మండలంలోని బాసురులో తుఫాన్ కారణంగా ఆరు కుటుంబాలు ఇళ్లు శిథిలావస్థకు చేరుకోవడంతో ఆ గ్రామంలో ఉన్న పాఠశాలలో వారు తలదాచుకున్నారు. వీరికి గురువారం సబ్ కలెక్టర్ స్వప్నిల్ పవర్ జగన్నాథ్ 25 కేజీల బియ్యం, నిత్యవసర సరుకులు అందించారు. ప్రస్తుత వరద పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన తో పాటు తహశీల్దార్ రాధాకృష్ణమూర్తి, ఎంపిపి బొమ్మల భాను, సర్పంచ్ గురువునాయుడు తదితరులున్నారు.



గుమ్మలక్ష్మీపురం: పత్తి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి



పాలకొండ: నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న సబ్ కలెక్టర్

గుంతలను వెంటనే పూడ్చాలి : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

తుపాను నేపథ్యంలో కురిసిన వర్షాల వల్ల దెబ్బతిన్న రహదారులను వెంటనే బాగు చేయించాలని ముఖ్యంగా రోడ్డుకు పడ్డ గుంతలను కప్పి ప్రమాదాలను నివారించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఇందిర డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని అర్థం గ్రామ సమీపంలో అంతర్రాష్ట్ర రహదారిపై ఏర్పడిన గోతులను సిపిఎం ఆధ్వర్యంలో పరిశీలించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తితో కలిసి ఆమె మాట్లాడుతూ భారీ వర్షాలు పడటంతో ఈ రహదారి మార్గంలో గొయ్యిలన్నీ నీటితో నిండిపోయాయని, అనేకమంది వాహనదారులు ఈ గొయ్యిలో పడి ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఉందని అన్నారు. నవంబర్ 10 లోపు ఈ మరమ్మతు పనులు చేపట్టకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు రామారావు, ఆటో యూనియన్ నాయకులు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు గుంతలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

రోడ్ల మరమ్మతులు తక్షణం చేపట్టాలి : సిపిఐ

పార్వతీపురం టౌన్: మన్యం జిల్లాలో రోడ్ల దుస్థితిపై అధ్వాన్నంగా ఉందని, తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కె.మన్మథరావు డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన వర్షాకాలం కారణంగా స్థానిక బైపాస్ రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి, రోజూ వందలాది వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని, ప్రజల ప్రాణాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులుతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా రహదారులు అత్యంత ప్రమాదకరంగా మారాయని, గత మూడు నెలలుగా అధికారులు ప్రజల విన్నపాలను పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. రోడ్ల మరమ్మతు పనులు మొదలుపెట్టినా సగం వదిలేసి కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రభుత్వం దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఇవి నాయుడు, ఆర్‌విఎస్ కుమార్, గోపి నాయుడు, సమితి నాయకులు మర్రి సీతారాం, సింహాద్రి కుమార్, ప్రసాదు, రాజు, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి రవికుమార్ నాయకులు వికాస్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో దొంగలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మన్యంలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను గిరిజనులు పట్టుకున్న సంఘటన గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో గురువారం వేకువ జామున చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మండలంలోని లోవముతా ప్రాంతమైన గద్దరజోలలో ఇళ్ల వద్ద దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను గ్రామస్తులు మాటువేసి పట్టుకొని పారిపోకుండా సిమెంట్ స్తంభానికి కట్టారు. గత కొన్నేళ్లుగా గిరిజన గ్రామాల్లో తిరుగుతూ రాత్రి వేళ ఇళ్లల్లో చొరబడి మేకలు, సెల్ ఫోన్లు, ఇంట్లో వస్తువులు ఎత్తుకుపోతూ గ్రామస్తులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారని తెలిపారు. దొంగతనాలను అరికట్టేందుకు, చోరీకి గురవుతున్న జంతువులు, వస్తువులను కాపాడుకునేందుకు అచ్చుబ, చినగీశాడ గ్రామస్తులతో కలిసి కాపు కాసి పట్టుకున్నామని తెలిపారు. చాకచాక్య గా ఇద్దరు దొంగలను గద్దర జోల గ్రామస్తులు పట్టుకోవడంతో పలువురు శభాష్ అంటున్నారు. ఈ సంఘటనపై ఎల్విన్‌పేట పోలీసులకు సమాచారం అందించమన్నారు.

బిల్లలవలసలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలోని బిల్లలవలసలో సర్పంచ్ తిరుమలరాజు పాపయ్యమ్మ ఆధ్వర్యంలో గురువారం కాలువల్లో పూడికతీతలతో పాటు, కాలువల్లో బ్లీచింగ్ చల్లారు. తుపాను తరువాత గ్రామంలో ఎటువంటి వ్యాధులూ ప్రబలకుండా ఈ పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి వర్మరాజు, కార్యదర్శి భాష, పారిశుధ్య కార్మికుడు బంగారి పాల్గొన్నారు.



ట్రిపుల్ రైడ్ చేస్తున్న యువత

రోడ్లపై బైక్‌లతో ట్రిపుల్ రైడింగ్

ప్రజాశక్తి - భామిని

పోలీసు వ్యవస్థ డ్రైవింగ్ లైసెన్స్ లేని పిల్లలకు వాహనాలు ఇవ్వద్దని అవగాహన కలిగిస్తున్నా, ట్రిపుల్ రైడింగ్ చేయొద్దని చెప్తున్నా క్షేత్ర స్థాయిలో రోడ్లపై ట్రిపుల్ రైడింగ్ ఆగడం లేదు. ప్రధానంగా విద్యార్థులు స్కూల్‌కి వెళ్లే సమయంలో, స్కూలు విడిచి పెట్టే సమయంలో ఆకతాయిల రోడ్లపై ట్రిపుల్ రైడింగ్ చేస్తున్నారని భామిని బస్టాప్‌లో పలువురు తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని తమ పిల్లలకు బైక్‌ని ఇచ్చేటప్పుడే పిల్లల తల్లితండ్రులు ఆలోచించాలని, ప్రమాదం జరిగాక ఆలోచిస్తే బాధపడడం తప్ప ఒరిగేదేమీ లేదని, ఒక వ్యక్తి నిర్లక్ష్య డ్రైవింగ్ వల్ల, మరో వ్యక్తి కుటుంబం రోడ్డున పడిపోతుందని, ఈ అంశాన్ని తల్లిదండ్రులు గ్రహించాలని ఇటీవల బత్తిలి పోలీసులు అవగాహన కార్యక్రమంలో తల్లితండ్రులకు చెప్పారు. అయినా యువత, తల్లిదండ్రుల్లో మార్పు రాలేదు.